క్లుప్తంగా

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



ఆర్మూర్: ఫిబ్రవరిలో ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సోమవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగం అభివృద్ధి చెందాలంటే 30శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించాలన్నారు. లేదంటే అసెంబ్లీ సమావేశాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు అనిల్, నిఖిల్, సాహెబ్ ఉన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి

బోధన్‌టౌన్(బోధన్): విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, వారి ప్రతిభను గుర్తించాలని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. పట్టణంలోని నిజామియా పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. 13 ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేయగా అందులకు అవసరమైన స్మార్ట్ బ్లాంక్‌స్టిక్, హోమ్ సెక్యూరిటీ సిస్టమ్ ప్రాజెక్టులు ఆకర్షించాయి. ఎంఈవో నాగనాథ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్‌మైమద్,తహసీల్దార్ వరప్రసాద్, ప్రధానోపాధ్యాయులు మహ్మద్ మజీబొద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ రాజశేఖర్‌తో పాటు, సిబ్బంది అమరవీరులకు నివాళులు అర్పించారు. అమరవీరుల చిత్ర పటం వద్ద రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

'ఉపాధి'లో అక్రమాలపై ఆగ్రహం



వర్ని: ఉపాధి హామీ పనుల్లో తప్పుడు రికార్డులు చేసిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై డీఆర్‌డీవో చందర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రజా వేదికను సోమవారం వర్ని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. 2019 నుంచి 2022 పనులను తనిఖీ చేశారు. మండలంలోని అన్ని హ్యాబిటేషన్లలో జరిగిన పనుల్లో తప్పుడు రికార్డులను అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయి పనికి రికార్డులకు వ్యత్యాసాలను గుర్తించారు. పనుల్లో జరిగిన అవినీతికి సంబంధించి సంబంధిత సిబ్బందికి జరిమానాలను విధించారు. సామాజిక తనిఖీకి సంబంధించి పూర్తి వివరాలను మంగళవారం వెల్లడిస్తామని తెలిపారు. మూడేళ్లలో వర్ని మండలంలో రూ. 9 కోట్ల 53 లక్షల నిధులతో హామీ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



వేల్పూర్: మండలంలోని అమీనాపూర్ గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ ఆకుల రాజేశ్వర్ ప్రారంభించారు. ఉపసర్పంచ్ మహేశ్, ఎంపీటీసీ గంగామణి, వైద్యాధికారి శరత్‌చంద్ర, సూపర్‌వైజర్ నాగమణి, వైద్యసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో రెండోవిడత కంటివెలుగు ప్రశాంతంగా కొనసాగుతుంది. సోమవారం పట్టణంలోని 36వ, 2వ, 5వ వార్డుల్లోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, మందులు అందజేస్తున్నామని మెడికల్ అఫిసర్ అయేషా పేర్కొన్నారు.

నరేందర్ వర్ధంతి సభ

నందిపేట్(ఆర్మూర్): మండలకేంద్రంలో సోమవారం ప్రజాపంథా ఆధ్వర్యంలో జర్నలిస్టు మల్లెపూల నరేందర్ 32వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

మహాత్మాగాంధీకి ఘన నివాళి

రుద్రూర్/బోధన్‌టౌన్/బాల్కొండ/కమ్మర్‌పల్లి: జాతిపిత మహాత్మా గాంధీకి కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో గాంధీజీ విగ్రహాలు, చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు వేర్వేరుగా పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గాంధీజీ సేవలను కొనియాడారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా పలు మండలాల్లో పార్టీ శ్రేణులు జాతీయ జెండాను ఎగురవేశారు.



రుద్రూర్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు



కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



బాల్కొండ మండల కేంద్రంలో..



బోధన్ పట్టణంలో..

పనులను సకాలంలో పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా
- పలు మండలాల్లో మన ఊరు- మన బడి పనుల పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): మన ఊరు- మనబడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా అన్నారు. పట్టణంలోని శక్కర్‌నగర్, ఫాండుఫారం, తీర్ గల్లీ, గాంధీ నగర్ కాలనీల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు- మనబడిలో కార్యక్రమంలో చేపట్టిన పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చిత్రామిశ్రా మాట్లాడుతూ.. మన ఊరు- మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి విద్యను అందించడమే లక్ష్యం అని పేర్కొన్నారు. కమిషనర్ ఖమర్ హైమద్, ఏఈ శివ కృష్ణ, అధికారులు ఉన్నారు.

చందూర్ మండలంలో..

రుద్రూర్: చందూర్ మండలం మేడిపల్లి తండా, మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న మన ఊరు- మనబడి పనులను సోమవారం అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పరిశీలించారు. పనుల్లో జాప్యం జరుగుకుండా నాణ్యతగా చేపట్టాలని ఆమె ఏఈపీఆర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో స ర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, రవి ఎంపీడీవో నీలావతి, ఎంఈవో శాంతకుమారి, ఎంపీవో తారాచంద్, ఏఈపీఆర్ పవన్, జీపీ కార్యదర్శులు సాయిలు, సీతారాం, జీపీ పాలవకర్గ సభ్యులు ఉన్నారు.



బోధన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

సీఎం హామీలను నెరవేర్చాలి

బోధన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన (ఎండీఎం) పథకం ఏజెన్సీ కార్మికులకు సీఎం కేసీఆర్ నెలకు రూ. 3వేల వేతనం అందజేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఐటీయూ అనుబంధం మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మార్చి నుంచి సమ్మెకు వెళ్తామని వెల్లడించారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ సంఘ నాయకులు

పలు గ్రామాల్లో పంటల పరిశీలన





ఫత్తేపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు.. కల్దుర్కి గ్రామంలో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో సోమవారం ఏడీఏ విజయలక్ష్మీ, ఏవో హరికృష్ణ వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వరిలో కాండము తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున నివారణకు రైతులు 8 కిలోల కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు లేదా క్లోరాంత్రానిలిప్రోల్ 0.4 గుళికలు 4 కిలోల చొప్పున పొలంలో చల్లుకోవాలని సూచించారు. అలాగే యూరియా మోతాదును తగ్గించుకోవాలని సూచించారు. సొసైటీ చైర్మన్ శ్రావణ్ రెడ్డి, ఏఈవో నరేష్, రైతులు పాల్గొన్నారు.

బోధన్ మండలంలో..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని కల్దుర్కి క్లస్టర్ పరిధిలో గల పలు గ్రామాల్లో సోమవారం ఏఈవో సాయిలు రైతులు సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. వరి పంటలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు.

స్వాజ్ బదిలీలు చేపట్టడం హర్షణీయం

నందిపేట్(ఆర్మూర్)/మాక్లూర్: స్వాజ్ బదిలీలు చేపట్టడంపై ఉపాధ్యాయుల హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలో జరుగుతున్న అఖిలాంధ్ర సాదు పరిషత్ మహాసభలో సోమవారం ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమెను ఉపాధ్యాయులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్‌జీటీ, భాషా పండితులు, పీఈటీల స్వాజ్ బదిలీల సమస్యను పరిష్కరించాలన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం..

ఎమ్మెల్సీ కవిత కేదారీశ్వర ఆలయానికి వెళుతుండగా.. మార్గమధ్యలో మండలంలోని మాణిక్‌బండార్ వద్ద ఆమెను బీఆర్ఎస్ నాయకులు కలిసి, పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, మాక్లూర్ సర్పంచ్ అశోక్‌రావు, మదన్‌పల్లి సర్పంచ్ శంకర్‌గౌడ్, తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తాం

బోధన్: మరింత ఉత్సాహంతో సామాజిక సేవాకార్యక్రమాలు కొనసాగిస్తామని లయన్స్‌క్లబ్ సభ్యులు సోమవారం పేర్కొన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిక చేసిన లయన్స్ క్లబ్‌లకు నిర్వాహకులు ఉత్తమ అవార్డులందించారు. ఈసందర్భంగా సోమవారం క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. అవార్డుల స్ఫూర్తితో సామాజిక సేవ కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.



అవార్డులు అందుకున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

బోధన్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ నియోజక వర్గంలో అభివృద్ధి శూన్యమని ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు ముషీర్ బాబా పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.సెక్యులర్ పార్టీ నాయకుడు ఓట్ల కోసం రాజకీయం చేస్తు బోధన్‌లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదమ్ముల వలె కలిసి ఉన్న వారిని విడగొట్టి రాజకీయాలు చేయరాదన్నారు. ఎంఐఎం కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు సరికావు



బోధన్: ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్‌పై ఎంఐఎం పట్టణ నాయకులు, కౌన్సిలర్లు అసత్య ఆరోపణలు చేయడం సరికాదని, తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్ర యాదవ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే షకీల్ నియోజకవర్గ అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో వరుసగా రెండుసార్లు గెలిచారన్నారు. మరోసారి ఎమ్మెల్యేపై అవాస్తవ ఆరోపణలు చేసేవ సహించబోమన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు అశ్వక్, రఫీ, తోకల గంగారెడ్డి, గంగాధర్ గౌడ్, నక్క లింగారెడ్డి, గుమ్ముల అశోక్ రెడ్డి,రవి శంకర్ గౌడ్, ప్రవీణ్ నాయక్‌లు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో పన్ను వసూళ్ల కోసం సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఆర్వో శేఖర్ తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పనులు వసూలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్‌కు సంబంధించిన మడిగెల అద్దె డబ్బులను, ఆస్తి పన్నులు రూ.93వేలు వసూలు చేశామన్నారు. ఆర్ఐ దత్తత్రి, నర్సయ్య, అర్జున్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఏసీడీ బిల్లులను రద్దు చేయాలి



బోధన్‌లో ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు, కార్యకర్తలు



నందిపేటలో ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

బోధన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్న ఏసీడీ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు పట్టణ శివారులోని డివిజన్ విద్యుత్ రెవెన్యూ ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏసీడీ పేరుతో వసూలు చేస్తున్న అదనపు చార్జీలు పేదలపై పెను భారంగా మారాయని పేర్కొన్నారు. ఏసీడీ చార్జీలు రద్దు చేయకుంటే ఆందోళనలు చేపడుతామని తెలిపారు.

నందిపేట్ మండలంలో..

నందిపేట్(ఆర్మూర్): విద్యుత్ వినియోగదారులపై ఏసీడీ అదనపు బిల్లులను వెంటనే రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా జిల్లా నాయకులు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందజేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేస్తూ, బిల్లులు కట్టిన వారికి డబ్బులు వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 43వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల ఉద్యమానికి తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. అసోసియేషన్ సభ్యులు పలువురు రిలే దీక్షలో కూర్చున్నారు.



నూతన కార్యవర్గం..

మండల స్థాయి పద్మశాలి సంఘం



నవీపేట: మండల కేంద్రంలోని భక్త మార్కండేయ మందిర ఆవరణలో సోమవారం మండల స్థాయి పద్మశాలి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండల అధ్యక్షుడిగా లోకం నర్సయ్య(నవీపేట), ప్రధానకార్యదర్శిగా మార సుధాకర్(నాగేపూర్), కోశాధికారిగా మ్యాక రమేష్(నవీపేట), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మరిపెద్ద ప్రదీప్(జన్నెపల్లి), ఉపాధ్యక్షుడిగా పుప్పాల భూమయ్య(బినోల), ఆనంద్(అభంగపట్నం, గిరానాథ్(నాళేశ్వర్), కిషన్(ఫకీరాబాద్), యువజన విభాగం మండల అధ్యక్షులు వేముల సురేష్(జన్నెపల్లి), మహిళా విభాగం మండల అధ్యక్షురాలుగా ఆడెపు అంజలి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లం హన్మాండ్లు నియామక పత్రాలను అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. పద్మశాలీలు రాజకీయంగా మరింత ఎదుగుదల సాధించాలని ఆకాంక్షించారు.

పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సవిత



మాక్లూర్: పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాక్లూర్ మండలం ఒడ్డేట్‌పల్లి గ్రామానికి చెందిన సవితను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి వెల్లడించారు. సోమవారం జరిగిన జిల్లా మహాసభలో తీర్మానం చేసి నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ఊరేగించారు. అనంతరం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

జన్నేపల్లి గ్రామంలో..



నవీపేట: మండలంలోని జన్నెపల్లిలోగల పురాతన శివాలయం, దుర్గామాత ఆలయాల్లో సోమవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తెడ్డు పోశెట్టి, సంజీవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం ఉప సర్పంచ్ మచ్చర్ల కిశోర్ రెడ్డి ప్రారంభించారు. గ్రామానికి చెందిన పైడి రాకేష్ రెడ్డి, గడ్డం భూమా రెడ్డి, సర్పంచ్ పూజిత కిశోర్‌రెడ్డి, ఎంపీటీసీలు గంగారెడ్డి, మహేందర్, ముక్తార్ ల్యాబ్ ఏర్పాటుకు రూ.లక్షను అందజేశారు.

తహసీల్దార్ జన్మదిన వేడుకలు

మాక్లూర్: మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ శంకర్ జన్మదిన వేడుకలను మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్‌తో కేక్‌ను కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా ప్రాంగణానికి మార్కింగ్..

బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో క్రీడా ప్రాంగాణ ఏర్పాటు కోసం సోమవారం మార్కింగ్ ఇచ్చారు. పనులను ఎంపీడీవో సంతోష్ కుమార్ పరిశీలించారు. అనంతరం అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఉప సర్పంచ్ లింబారెడ్డి, ఎఫ్ఏ అనిల్ ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఆయనను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు.

విద్యార్థులకు అభినందన

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ముత్తు సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 28, 29 తేదీల్లో నిర్వహించిన తెలంగాణ క్యోరుగి రాష్ట్రస్థాయి సబ్ జూనిర్ తైక్వాండో చాంపియన్ పోటీల్లో వారు సత్తాచాటరన్నారు. పతకాలు సాధించిన అక్షంతల శ్లోకేష్, గిరీష్‌ను అభినందించారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



బాల్కొండ: ముప్కాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సోమవారం మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ డీపీవో సంజీవ్ 5ఫ్యాన్లు, రిటైర్డ్ పీజీ హెచ్ఎం పుష్పనాథ్ రెండు ఫ్యాన్లను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.